సాక్షి అనకాపల్లి

గురువారం। 12। జూన్। 2025



ఘనంగా అమ్మవారి సంబరం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి సోదరి, అడవివరం గ్రామ దేవత పైడి తల్లి పండగను ఘనంగా నిర్వహించారు.

ఉష్ణోగ్రతలు

బుధవారం

	గరిష్ఠం/కనిష్ఠం
అనకాపల్లి :	31.3/24.8
చోడవరం :	34.8/27.4



నారికేళ జల అభిషేకం

పెందుర్తి: జ్యేష్ట పౌర్ణమిని పురస్కరించుకుని వేంకటాద్రిపై కొలువుదీరిన వెంకన్నకు అఖండ నారికేళ జల అభిషేకం నిర్వహించారు.



వీరు అల్లూరి జిల్లాలోని హుకుంపేట మండలం పామురాయి గ్రామానికి చెందిన గిరిజనులు. వీరు మొన్నటివరకూ ఇంటి వద్దనే ఎండీయూ వాహనాల్లో రేషన్ తీసుకునేవారు. ఈ నెల రేషన్ కోసం నాలుగు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చింది. కామయ్యపేట డిపో నుంచి రేషన్ తీసుకొని మోసుకొని ఇంటికి రావాల్సిన దుస్థితి ఏర్పడింది.



పెదబయలు మండలం ఇంజరి పంచాయతీ జాలంపల్లి గ్రామానికి చెందిన గిరిజనుడు వంతాల రాజంనాయుడు... జూన్ 8వ తేదీన జి.మాడుగుల మండలంలోని బోయితిలి గ్రామంలో మృతి చెందాడు. మృతదేహాన్ని వెదురు కర్రలకు డోలి మాదిరిగా కట్టుకుని నాలుగు కిలోమీటర్ల మేర కొండలు, గుట్టలు ఎక్కి సొంత గ్రామం జాలంపల్లికి తరలించారు.



ఈ ఫొటోలోని వ్యక్తి అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలంలోని శింగవరం గ్రామానికి చెందిన రైతు కలవలపల్లి మాలునాయుడు. ఈ ఏడాది వర్షాలు ముందుగానే వచ్చినా.. ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందక ఉత్సాహం లేదని చెప్పారాయన. జగన్ బాబు ఉన్నప్పుడు పంట సాగుకు ముందే పెట్టుబడికి రైతు భరోసా నగదు బ్యాంకులో పడేదని, ఇప్పుడు అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసా సొమ్ముతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొని పంటల సాగు చేసేవాడినని తెలిపారు. తనకున్న రెండెకరాల్లో వరి పంట సాగుకు ఆకుమడి దున్ని సిద్ధం చేశానని, కానీ ఈ ఏడు పెట్టుబడి సాయం ఇస్తారో లేదో స్పష్టత లేదని చెప్పారు.



అనకాపల్లి జిల్లా సబ్బవరానికి చెందిన నక్కెళ్ల సన్యాసమ్మకు ఇద్దరు పిల్లలు. భర్త చనిపోవడంతో రెండు ఆవు పెయ్యిలను మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. పశువుల దాణాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన చెందుతోంది. పాల సేకరణ ధరలు బాగా తగ్గాయి. అప్పుడు అమూల్ ఉన్నప్పుడు పాల సేకరణ ధర బాగుండేదని ఆవేదన చెందుతోంది. పశు వైద్య సిబ్బంది గ్రామంలోని ప్రతీ పశువుకూ బీమా కల్పించారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని వాపోతోంది.

అందరికీ పంగనామాలు

కూటమి ఏడాది పాలన అంతా మోసం, దగా

సూపర్ సిక్స్ హామీలకు మంగళం

వీరే కాదు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, మహిళలు, గిరిజనులు... ఇలా అన్ని వర్గాల ప్రజలూ నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. కొత్తగా ఒక్క పింఛను ఇచ్చింది లేదు... ఒక్క ఉద్యోగం కల్పించిందీ లేదు. సొంత గ్రామంలో గౌరవంగా ఉంటున్న వలంటీర్లను, రేషన్ సరుకులను పంపిణీ చేస్తూ వాహనాన్ని నడిపే నిరుద్యోగ డ్రైవర్లు, వారికి సహకరించే హెల్పర్లు.. ఇలా అందరికీ ఉన్న ఉపాధినీ తీసివేసి రోడ్డున పడవేసింది కూటమి ప్రభుత్వం. ఇక రైతులకు ఉన్న ఊర్లోనే అందే ఎరువులు, విత్తనాలు అందకుండా **తిరిగి మండల కేంద్రాలకు** వెళ్లి ప్రైవేటుగా అధిక ధరలకు **తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది**. గడిచిన ఏడాదిగా రైతులకు **పెట్టుబడి సాయంగా కానీ...** నష్టపరిహారంగా కానీ చిల్లి గవ్వ కూట**మి ప్రభుత్వం అందించ**లేదు. కొత్త పింఛన్ మాట దేవుడెరుగు... **ఉన్న పింఛన్లను తీసే**స్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 **వేల పింఛన్లకుపైగా** గత ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం **తొలగించింది. ఒక్క కొత్త** రేషన్ కార్డు ఇవ్వకపోగా... రేషన్ కార్డు**లో మార్పుచేర్పులకే కొత్త** సమస్యలు తెచ్చిపెట్టింది. మహిళలకు **ఆడబిడ్డ నిధి కింద నెల**నెలా రూ. 1,500 అకౌంట్లోకి వేస్తామన్న **హామీ కనీసం ఊసులో** లేకుండా పోయి.. సోషల్ మీడియాలో **మీమ్‌గా మారిపోయింది.** జీవీఎంసీ పరిధిలో కాంట్రాక్టర్లకు బిల్లుల **చెల్లింపులు ఎక్కడిక**క్కడ పెండింగ్‌లో ఉన్నాయి. కొత్తగా **ఒక్క అభివృద్ధి కార్యక్ర**మాన్ని ప్రారంభించలేదు. కేవలం గత **వైఎస్సార్ సీపీ ప్రభుత్వ** హయాంలో ప్రారంభించిన పనులను **మాత్రమే కొనసాగిస్తోంది.** కనీసం రెగ్యులర్ కమిషనర్‌ను కూడా నియమించలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది. పాఠశాలలు నేడు ప్రారంభమవుతున్నప్పటికీ పిల్లలకు పుస్తకాలు కూడా సరిగా అందే స్థితి కనపడటం లేదు. ఇలా గడిచిన ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వ హయాంలో ఇటు విశాఖ నగరం... అటు గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు అందకుండా పోయాయి. – సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/విశాఖ సిటీ



హామీలన్నీ గాలికి..



సూపర్ సిక్స్ పేరుతో బూటకపు హామీలు గుప్పించి ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు ఆ హామీలు నెరవేర్చడానికి ఖజానా ఖాళీ అయిపోయిందని కుంటి సాకులు చెబుతున్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తానని, ఉచిత బస్సు ప్రయాణమని మాయమాటలు చెప్పారు. ప్రతి రైతుకు ఏడాదికి పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి అన్నదాతకు వెన్నుపోటు పొడిచారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్, పీఆర్‌సీ, పెండింగ్ డీఏలు అన్నీ ఇస్తామని చెప్పి బుట్టలో వేసుకుని ఇప్పుడు నిలువునా ముంచారు. ఇలా విద్యార్థుల నుంచి ఉద్యోగుల వరకు అందరికీ పంగనామాలు పెట్టారు.

భూముల ధారాదత్తం

కూటమి ప్రభుత్వంలో ఒక్క కొత్త ఆతిథ్య రంగ సంస్థ కూడా రాలేదు. మంత్రి నారా లోకేష్ విశాఖను ఐటీ రాజధానిగా చేస్తానని చెప్పారు. దీని పేరు చెప్పి ఊరు పేరు లేని ఉర్సా కంపెనీకి రూ.500 కోట్లు విలువ చేసే 60 ఎకరాల భూములను ధారాదత్తం చేసేశారు. ఐటీ కంపెనీల పేరుతో విశాఖ సంపదను, భూములను దోచి పెడుతున్నారు.

ప్రతి ఎన్నికలకు ముందు అవే అబద్ధాలు

ప్రతి ఎన్నికలకు ముందు యువత, నిరుద్యోగుల ఓట్లు కొల్లగొట్టేందుకు చంద్రబాబు ఇంటికో ఉద్యోగం, భృతి వల్లెవేయడం పరిపాటిగా మారిపోయింది. 2014 ఎన్నికల్లోనూ అదే అబద్ధంతో చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. నాలుగున్నరేళ్ల పాటు సాగదీసిన తర్వాత.. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో నిరుద్యోగ భృతి పేరుతో హడావుడి చేశారు. ప్రతి నిరుద్యోగికి రూ.2 వేల భృతి అని ప్రకటించి.. చివరికి రూ.1000 మాత్రమే ఇస్తామన్నారు. అది కూడా సక్రమంగా ఇవ్వకుండా రోజుకో కొత్త నిబంధన తీసుకొచ్చి.. నిరుద్యోగులకు ముచ్చెమటలు పట్టించారు.

4.5 లక్షల మంది నిరుద్యోగులు..!

విశాఖ జిల్లాలోని 11 మండలాల పరిధిలో 5.45 లక్షల ఇళ్లు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ, లిమిటెడ్ కంపెనీల పరిధిలోనూ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న వారి సంఖ్య సుమారు 3.40 లక్షల మంది ఉంటారు. అంటే మిగిలిన 2.05 లక్షల ఇళ్లలో ఉన్న నిరుద్యోగులకు భృతి ఇవ్వాల్సి ఉంటుంది. అంటే.. మొత్తం నిరుద్యోగులు దాదాపు 4.5 లక్షల మంది ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరందరికీ రూ.3 వేలు చొప్పున ప్రతి నెలా నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంటుంది. అంటే.. ప్రతి నెలా జిల్లాలో ఉన్న నిరుద్యోగులకు రూ.135 కోట్లకు పైగానే అందించాలి. కానీ కూటమి ప్రభుత్వం ఈసారి కూడా భృతిని అందించే పరిస్థితి లేనట్లు కనిపిస్తోంది.

వైఎస్సార్ సీపీ హయాంలో ఉద్యోగాల వెల్లువ

2019 నుంచి 2024 మధ్య కాలంలో ఉద్యోగాల జాతరే జరిగింది. విశాఖ జిల్లా పరిధిలో 6,500 సచివాలయ ఉద్యోగాల పేరుతో శాశ్వత ఉద్యోగాలు కల్పించారు. అదేవిధంగా ఆప్కోస్ ద్వారా అవుట్‌సోర్సింగ్ కింద 40 వేల ఉద్యోగాలిచ్చారు. కాంట్రాక్టు పద్ధతిలో 1500కిపైగా ఉద్యోగాలు పొందారు. దీంతో పాటు జాబ్ మేళాలు, రాష్ట్రంలో ప్రారంభమైన ఫార్మా, ఉత్పత్తుల **కంపెనీల్లో 50 వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు పొందారు. వీరితో పాటు.. సొంత ఊరిలో** సొంత వీధిలో రూ.5 వేల గౌరవ వేతనం పొందుతూ 15 వేల మందికి పైగా నిరుద్యోగులు వలంటీర్లుగా సేవలందించారు. ఇలా ఐదేళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ సొంతం చేసుకుంది. కూటమి ప్రభుత్వం ఈ తరహా అవకాశాలు కల్పించే అవకాశాలు ఎక్కడా కనిపించడం లేదని నిరుద్యోగులు విమర్శిస్తున్నారు. కొత్త **ఉద్యోగాలు ఇవ్వకపోగా** వలంటీర్లను **తొలగించింది. కాంట్రాక్టు** ఉద్యోగాల్లో **కూడా కోత** పెట్టాలని చూస్తోంది.

స్టీల్‌ప్లాంట్ కార్మికుల గోడుపట్టదా?



ఉక్కు పరిశ్రమను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం నెమ్మదిగా ఉద్యోగులను వీఆర్ఎస్ పేరుతో ఇంటికి పంపిస్తోంది. కాంట్రాక్టు కార్మికులపై వేటు వేసింది. దీంతో వేలాది మంది కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. గత ఏడాది కాలంగా కార్మికులు రోడ్డెక్కి ఆందోళనలు, ర్యాలీలు, నిరాహార దీక్షలు చేస్తున్నా.. ముఖ్యమంత్రి చంద్రబాబు గానీ, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌గానీ వారి గోడును పట్టించుకున్న దాఖలాలు లేవు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కార్మికులు నిరసనలు చేపడుతుంటే.. వారి ఆందోళనలను అణిచివేయడానికి పోలీసులను ప్రయోగిస్తుండడం గమనార్హం.

రైతులకు వెన్నుపోటు



కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన 'అన్నదాత సుఖీభవ' పథకం హామీ అధికారంలోకి వచ్చాక నెరవేర్చలేదు. ఏటా రూ.20,000 రైతులకు అందించకపోవడంపై అన్నదాతలు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఇది తమకు వెన్నుపోటు పొడవడమేనని వాపోతున్నారు. పెట్టుబడి సాయం అందకపోగా.. సకాలంలో విత్తనాలు, ఎరువులు సరఫరా చేయడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తున్నారు. ఉచిత పంటల బీమాను రద్దు చేసి, ఆ భారాన్ని రైతులపైనే మోపడం, పంటలను రక్షించడానికి సమీక్షలు లేకపోవడం, రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసి, రైతు సహాయకులను సచివాలయాలకే పరిమితం చేయడం వంటివి రైతుల కష్టాలను మరింత పెంచాయి. కనీస మద్దతు ధర కూడా ఇవ్వలేకపోగా.. ఆక్వా, పాడి రైతులను కూడా ప్రభుత్వం నిట్టనిలువునా ముంచేసింది.



ఆశ వర్కర్ల ఆందోళన (ఫైల్)

రోడ్డున పడ్డ ఉద్యోగులు

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వలంటీర్లు, 108 ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ టీచర్లు, ఆశా కార్యకర్తల ధర్నాలు, నిరసనలతో విశాఖ హోరెత్తిపోతోంది. ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని 108 ఉద్యోగులు.. విధుల్లోకి తీసుకొని రూ.10 వేలు వేతనం ఇవ్వాలని వలంటీర్లు.. సమస్యలు పరిష్కరించాలంటూ ఆశ వర్కర్ల నిరసనలు.. ఆకలి కేకలతో అలమటిస్తూ పెండింగ్ జీతాల కోసం ఆయాల పొలికేకలు.. ఎండీయూ వాహనాలు రద్దు చేయడంతో రోడ్డున పడ్డ 702 మంది ఆపరేటర్లు, హెల్పర్ల ఆర్తనాదాలు.. ఇలా చంద్రబాబు ఏడాది పాలనలోనే అన్ని వర్గాల నుంచి అసహనం కట్టలు తెంచుకుంటోంది.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ...

- రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి...తండ్రికి సీరియస్
- ఆర్.శివరాంపురంలో విషాదఛాయలు

-8లో

డీపీఆర్వోగా రమణ

మహారాణిపేట(విశాఖ): అనకాపల్లి జిల్లా డీపీఆర్వోగా సీహెచ్ రమణ నియమితులయ్యారు. ఆయన విశాఖ జిల్లా నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. విశాఖజిల్లా సమాచారశాఖ డిప్యూటీ డైరెక్టర్(డీడీ)గా సదారావు నియమితులయ్యారు. నెల్లూరు జిల్లాలో డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. ఇక్కడ చాలా రోజుల నుంచి డీడీ పోస్టు ఖాళీగా ఉంది. విజయనగరం జిల్లాలో అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా పనిచేస్తున్న డి.రమేష్‌ను విశాఖ జిల్లా ఏడీగా నియమించారు.

పంటలు సమృద్ధిగా పండాలి

- హోం మంత్రి అనిత

ఎస్.రాయవరం: తిమ్మాపురం పొలాల్లో ఏర్పాటు చేసిన ఏరువాక కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఎద్దులతో ఏర్పాటు చేసిన నాగలి పట్టుకుని దుక్కు ప్రారంభించారు. వర్షాలు సమృద్ధిగా పడి పంటలు సక్రమంగా పండాలన్నారు. వ్యవసాయాధికారులు సౌజన్య, ఉమాప్రసాద్ పాల్గొన్నారు.



ఏరువాక కార్యక్రమంలో పాల్గొన్న హోం మంత్రి అనిత

అప్పుల పాలయ్యాం.. మధ్యాహ్న భోజనం పెట్టలేం

- బకాయి పడ్డ బిల్లులు, జీతాలు వెంటనే విడుదల చేయాలి
- మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల డిమాండ్



చోడవరంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు

చోడవరం: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు రావలసిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం ముఖ్యనాయకుల సమావేశం చోడవరంలో బుధవారం జరిగింది. డిసెంబరు నెల నుంచి నేటి వరకూ మధ్యాహ్న భోజన పథకం బిల్లులు మంజూరు కాలేదని, అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్నామని చెప్పారు. వడ్డీలు కట్టుకోలేక చాలా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఐదు నెలలుగా బిల్లులు రాలేదని, పాఠశాలలు తెరిస్తే విద్యార్థులకు ఎలా భోజనం పెట్టగలమని ఆమె ప్రశ్నించారు.గత ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా 15వ తేదీకి బిల్లులు వచ్చేవని, కూటమి ప్రభుత్వం వచ్చాక సకాలంలో ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వేతనాలు కూడా సరిగా ఇవ్వడం లేదన్నారు. ఇదే ఉపాధిగా జీవిస్తున్న తాము జీతాలు రాక, బిల్లులు చెల్లించక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయామని, అప్పులు తెచ్చి భోజనం పెట్టలేమని ఆమె చెప్పారు. వెంటనే ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని వరలక్ష్మి హెచ్చరించారు. ఆందోళనలో సంఘ ప్రతినిధులు ఎస్.అమ్మాజీ, బి.ఉమ, కె.నాగమణి, ఒ.దేముడమ్మ, ఆర్.బుచ్చిరాజమ్మ, ఎం.దేవి, వరలక్ష్మి, రాజులమ్మ, సత్యవతి పాల్గొన్నారు.

మోగనుంది సమస్యల గంట

- నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం
- పూర్తికాని ఉపాధ్యాయుల బదిలీలు
- అసంపూర్తిగా తరగతి, టాయిలెట్స్ నిర్మాణాలు
- పూర్తిస్థాయిలో రాని స్టూడెంట్ కిట్లు
- అసంపూర్తిగా నాడు–నేడు పనులు
- చాలా పాఠశాలల్లో పనిచేయని ఆర్వో ప్లాంట్లు



నాడు–నేడు పనులతో కళకళలాడుతున్న చందనాడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల



నక్కపల్లి మండలం బోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పగిలిన గచ్చులు

సాక్షి, అనకాపల్లి: వేసవి సెలవులు పూర్తయ్యాయి. గురువారం నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ప్రైవేట్ పాఠశాలలు సకల సౌకర్యాలతో విద్యార్థుల తల్లిదండ్రులను రా రమ్మని స్వాగతం పలుకుతుండగా.. సర్కారు బడులు సౌకర్యాల లేమితోనే విద్యార్థులను ఆహ్వానిస్తున్నాయి. జిల్లాలో కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, అదనపు తరగతి గదుల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. పలుపాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులకు తాగునీటి సమస్య తలెత్తనుంది. ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. విద్యార్థులకు పాఠశాలలు తెరిచే నాటికే పంపిణీ చేయాల్సిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లలో (స్టూడెంట్ కిట్స్) ఇంకా చాలా వస్తువులు రాలేదు. సాధారణంగా పాఠశాలలు పునఃప్రారంభం నాటికే విద్యాశాఖ అధికారులు అన్ని సిద్ధంచేయాలి. కానీ ఈ విద్యా సంవత్సరం అసౌకర్యాలతోఆరంభం కానుంది.

పూర్తికాని ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ

పాఠశాలలు పునఃప్రారంభానికే ఉపాధ్యాయుల బదిలీలు ప్రక్రియ పూర్తిచేస్తామని విద్యాశాఖాధికారులు ముందుగానే ప్రకటించారు. కానీ ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. గురువారం పాఠశాలలు తెరుచుకోనున్నాయి. అయినా ఉపాధ్యాయులు బదిలీ ప్రక్రియ సగభాగం కూడా పూర్తికాలేదు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి మరికొన్ని రోజులు పడుతుందని ఉపాధ్యాయులే భావిస్తున్నారు. తక్కువ సంఖ్యలో ఉన్న స్కూల్ అసిస్టెంట్లు బదిలీ ప్రక్రియ పూర్తయినప్పటికీ.. అత్యధిక సంఖ్యలో ఉన్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ మాత్రం ఇంతవరకు ఓకొలిక్కి రాలేదు. బుధవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు 300 మందికి మాత్రమే మాన్యువల్ కౌన్సెలింగ్ జరిగింది. పాఠశాలలు తెరిచిన రోజైన గురువారం మరో 500 మందికి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. వారంతా పాఠశాలలకు వెళ్లకుండా కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సిందే. దీంతో పాఠశాలలు మొదటి రోజు అరకొర ఉపాధ్యాయులతో ప్రారంభం కాబోతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో 2,782 మంది ఎస్జీటీలు కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకొన్నారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉంటే వారందరికీ కౌన్సెలింగ్ పూర్తయ్యేసరికి మరో వారం పడుతుందని అధికారులు అంటున్నారు.

ఎక్కడి పనులు అక్కడే..

వైఎస్సార్‌సీపీ హయాంలో 'నాడు–నేడు'లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ, మౌలిక వసతుల కల్పన చేపట్టారు. మొదటి విడతలో రూ.156.44 కోట్లతో 598 పాఠశాలల్లో, రెండో విడతలో రూ.112.54 కోట్లతో 616 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టి, గత ప్రభుత్వ హయాంలోనే 70 శాతం వరకు పూర్తి చేశారు. బెంచీలు, ఐఎఫ్‌బీ ప్యానెళ్లు, ఆధునిక వసతులతో కూడిన మరుగుదొడ్లు, డైనింగ్ హాళ్లు, తాగునీరు, వాడుకనీటి సదుపాయాలు కల్పించారు. కూటమి ప్రభుత్వం రావడం పాఠశాలల పాలిట శాపంగా మారింది. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పాయకరావుపేట నియోజకవర్గంలో దేవవరం, చినదొడ్డిగల్లు, రాజయ్యపేట, రమణయ్యపేట, బోయపాడు, డీఎల్‌పురం, ముకుందరాజుపేట, అయ్యన్నపాలెం, నక్కపల్లి పాఠశాలల్లో భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయి. పెద బోదిగల్లం పాఠశాల భవనాలు పూర్తిగా శిథిలమయ్యాయి. అలాగే ఎస్.రాయవరం మండలం, కశింకోట మండలం, అనకాపల్లి మండలంలోని అనేక పాఠశాలల్లో భవన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి.

జిల్లాలో పాఠశాలల వివరాలు

ప్రాథమిక	- 1,152
ప్రాథమికోన్నత	- 341
ఉన్నత	- 431
మొత్తం పాఠశాలలు	- 1,924
విద్యార్థుల సంఖ్య	- 2,21,788
మొత్తం ఉపాధ్యాయులు	- 10,412

పాఠశాలల కుదింపు.. ఉపాధ్యాయుల కొరత

విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరలేదని ఎంపీయూపీ స్కూల్స్‌ను ఎంపీపీ స్కూల్స్‌గా కొన్నిచోట్ల కుదించారు. దేవరాపల్లి మండలంలో వాకపల్లి, నాగయ్యపేట, రైవాడలో ఉన్న ఎంపీయూపీ స్కూల్స్‌ను ఎంపీపీ స్కూల్స్‌గా కుదించారు. కె.కోటపాడు మండలంలో కె.కోటపాడు, చౌడువాడ, పిండ్రంగి, దాలివలస ఎంపీయూపీ స్కూల్స్‌ను ప్రైమరీ మోడల్స్ స్కూల్స్‌గా మార్చారు. కోటవురట్ల మండలంలో ఎండపల్లి, చౌడువాడ, పందూరులో ఉన్న ఎంపీయూపీ స్కూల్స్‌ను ఎంపీపీ స్కూల్స్‌గా కుదించారు. స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న చాలామంది ఉపాధ్యాయులు ప్రభుత్వం నుంచి వచ్చే ఒత్తిడి తట్టుకోలేక ఇటీవల జరిగిన బదిలీల్లో ప్రైమరీ స్కూల్ హెచ్ఎంలుగా బదిలీపై వెళ్లిపోయారు. వీరి స్థానంలో వచ్చేందుకు ఇతర ప్రాంతాల ఉపాధ్యాయులు ఆసక్తి చూపిండచం లేదు. దీంతో జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు, భాషా ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది.



స్టూడెంట్స్ కిట్స్ కొరత

జిల్లాలోని వివిధ మండలాల పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రక్రియకు విద్యాశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. జిల్లాలో మొత్తం 5,13,887 పుస్తకాల అవసరం ఉంది. ఇప్పటికే గాజువాకలో గల బుక్ డిపో నుంచి అనకాపల్లి జిల్లాలో గల వివిధ ప్రభుత్వ పాఠశాలలకు తరలించారు. విద్యార్థి మిత్ర కిట్లలో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌తో పాటు బ్యాగ్, బూట్లు, సాక్సులు, యూనిఫాం, బెల్ట్ ఉండాలి. వాటిలో చాలాచోట్ల టై, బెల్ట్, బ్యాగ్ మాత్రమే వచ్చాయి. యూనిఫాంలు, బూట్లు, సాక్సులు రావాల్సి ఉంది. కొన్నిచోట్ల బ్యాగులు కూడా పూర్తి స్థాయిలో ఇంకా చేరలేదు.

'మోదీ మెప్పు కోసమే యోగాంధ్ర ప్రచార ఆర్భాటం'


మాట్లాడుతున్న వెంకన్న

దేవరాపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ మెప్పు కోసమే రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర పేరిట ప్రచార ఆర్భాటం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న విమర్శించారు. ఈ మేరకు దేవరాపల్లిలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. యోగాతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి అధికార యంత్రాంగాన్ని యోగా కోసం వినియోగించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నెల 21న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే మోదీ సభకు లక్షల మందిని విశాఖకు తరలించడం ప్రజాధనం వృథా తప్పా, రాష్ట్రానికి ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. రైతులు, శ్రామికులు, ఉపాధి కూలీలలతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, నిరుద్యోగులు సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తూ..

- స్కూటీ బ్రేకులు ఫెయిల్.. తల్లి మృతి.. తండ్రికి సీరియస్
- అనాథలైన పసిపాపలు
- పూర్ణామార్కెట్ సమీపంలోని ఘాట్ రోడ్డులో ఘటన


కృష్ణకుమారి (ఫైల్)


సంఘటన స్థలంలో మరణించిన కృష్ణకుమారి, తీవ్ర గాయాలతో చిలుకునాయుడు


ప్రమాదం నుంచి బయటపడిన చిన్నారి హాత్విక

జగదాంబ/బుచ్చెయ్యపేట: భార్య వైద్య పరీక్షల కోసం కేజీహెచ్‌కు బయలుదేరిన ఆ కుటుంబం.. గమ్యం చేరకముందే ప్రమాదం బారిన పడింది. ఇసుకకొండ సత్యనారాయణ స్వామి దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడటంతో.. భార్య అక్కడికక్కడే కన్నుమూయగా, భర్త పరిస్థితి విషమంగా ఉంది. కన్నవారి కోసం ఆ పసిపిల్లల ఎదురుచూపులు, వారి ఆలనాపాలనా చూడాల్సిన నాన్నమ్మ గుండెలవిసేలా రోదించడం గ్రామస్తులను కంటతడి పెట్టించింది. ఈ ఘటనతో బుచ్చెయ్యపేట మండలం ఆర్.శివరాంపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దేవర చిలుకునాయుడు దివ్యాంగుడు. కాళ్లు చచ్చుబడ్డా.. ఆత్మవిశ్వాసాన్ని చంపుకోలేదు. ఎనిమిదేళ్ల కిందట దిబ్బిపాలేనికి చెందిన కృష్ణకుమారి (33)ని వివాహం చేసుకున్నాడు. గ్రామంలో చిన్న పాన్‌షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్న చిలుకునాయుడికి భార్యే చేదోడు వాదోడుగా ఉండేది. వారికి ఇద్దరు కుమార్తెలు యువశ్రీ(4), హాత్విక(8 నెలలు) ఉన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణకుమారిని ప్రతి నెలా కేజీహెచ్‌కు తీసుకొస్తున్నాడు చిలుకునాయుడు. బుధవారం ఉదయం కూడా తన మూడు చక్రాల స్కూటీపై భార్య, చిన్న కూతురు హాత్వికతో కలిసి శివరాంపురం నుంచి బయలుదేరాడు. ఈ క్రమంలో వీరు సత్యనారాయణ స్వామి దర్శనానికి ఘాట్ రోడ్డులో వెళ్లి తిరిగి వస్తున్నారు. పూర్ణామార్కెట్ సమీపంలో మొదటి మలుపు వద్ద స్కూటీ బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. అదుపుతప్పిన వాహనం వేగంగా గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణకుమారి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. చిలుకునాయుడు తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్కూటీలో ముందు కూర్చున్న 8 నెలల హాత్విక పక్కనే ఉన్న ఇసుక దిబ్బపై పడటంతో ప్రాణాలతో బయటపడింది. ఆ పసిపాప ఏడుపు విని చలించిపోయిన ఓ మహిళా వ్యాపారి, చిన్నారిని దగ్గరకు తీసుకుని సపర్యలు చేసింది. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించింది. ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిలుకునాయుడు పరిస్థితి విషమంగా ఉందని, 24 గంటలు గడిస్తే కానీ ఏమీ చెప్పలేమని వైద్యులు తెలిపారు.

గుండెలు పగిలేలా రోదన

చిలుకునాయుడు తండ్రి చిన్నోడు గతంలోనే మరణించారు. కొడుకు చిలుకునాయుడే తల్లి రాజులమ్మకు ఆధారం. ఇప్పుడు కోడలు మరణించి, కొడుకు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుండటంతో ఆ తల్లి గుండె పగిలింది. 'నా కొడుకు బతకాలి.. ఈ పసిపిల్లల్ని ఎలా సాకాలి? రేపటి నుంచి మా బతుకులేంటి?' అంటూ ఆమె నేలపై పడి రోదించిన తీరు అక్కడి వారందరినీ కదిలించింది. తల్లి చనిపోయిందని, తండ్రి ఆసుపత్రిలో ఉన్నాడని తెలియని ఆ ఇద్దరు పసిపిల్లలు బిక్కుబిక్కుమంటూ ఎదురుచూస్తుండటం చూపరులను కలిచివేసింది. చితికిపోయిన ఈ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

ఉపాధ్యాయుల సహనానికి పరీక్ష

రెండో రోజూ బదిలీల కౌన్సెలింగ్‌లో గందరగోళం


కౌన్సెలింగ్‌కు హాజరైన ఎస్జీటీ ఉపాధ్యాయులు

ఆరిలోవ(విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్‌లో రెండో రోజూ గందరగోళం నెలకొంది. సాంకేతిక లోపాలు, అధికారుల జాప్యంతో బుధవారం కూడా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎస్జీటీ ఉపాధ్యాయల బదిలీ కోసం మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మాన్యువల్ కౌన్సెలింగ్ ప్రారంభమైన విషయం తెలిసిందే. మొదటి రోజు సాంకేతిక సమస్యలతో అంతా గందరగోళంగా మారింది. దీంతో మొదటి రోజు కౌన్సెలింగ్ పూర్తిగా రద్దు కాగా, రెండో రోజు ఉదయం నుంచి రాత్రి వరకు పడిగాపులు కాయడంతో వారి సహనం నశించి అధికారులను నిలదీశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం 1 నుంచి 300 వరకు కౌన్సెలింగ్ జరగాల్సి ఉండగా ఉపాధ్యాయులు ఉదయం 10 గంటలకే చేరుకున్నారు. కానీ కౌన్సెలింగ్ ఆలస్యంగా మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమైంది. ప్రక్రియ నత్తనడకన సాగడంతో మధ్యాహ్నం 2.40 గంటలకు కేవలం 20 మందికి, మధ్యాహ్నం 3.30 గంటలకు 50 మందికి, సాయంత్రం 7.45 గంటలకు 210 మందికి మాత్రమే పూర్తయింది. మిగిలిన 90 మంది కౌన్సెలింగ్ ఆలస్యం కావడంతో.. అప్పటి వరకు నిరీక్షించిన ఉపాధ్యాయుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. వారు ఉమ్మడి జిల్లాల డీఈవోల వద్దకు వెళ్లి, అధికారులు కావాలనే తమను ఇబ్బంది పెడుతున్నారంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు మరోసారి సాంకేతిక సమస్యనే కారణంగా చెప్పినా వారు శాంతించలేదు. చివరకు మిగిలిన వారికి కౌన్సెలింగ్ పూర్తయ్యే సరికి రాత్రి 11 గంటలు దాటింది.

పాఠశాలల తొలిరోజే టీచర్ల గైర్హాజరు!

మరోవైపు గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. నేడు మరో 500 మందికి కౌన్సెలింగ్ నిర్వహిస్తుండటంతో, వారంతా తొలిరోజు పాఠశాలలకు గైర్హాజరు కావడం ఖాయంగా కనిపిస్తోంది. మొదటి రోజు సాంకేతిక లోపంతో కౌన్సెలింగ్ రద్దు కావడం, రెండో రోజు ఈ జాప్యం జరగడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా.. గురువారం 301 నుంచి 800 వరకు ఎస్జీటీ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని విశాఖ డీఈవో ఎస్. ప్రేమ కుమార్ తెలిపారు. ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆయన సూచించారు.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సమస్యలపై పోరాడదాం..

- వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం దిశగా విస్తృత సమావేశాలు
- పార్టీ చోడవరం సమన్వయకర్త, మాజీ మంత్రి అమర్‌నాథ్


గోవాడలో వైఎస్సార్‌సీపీ ముఖ్య కార్యకర్తలతో మాట్లాడుతున్న అమర్‌నాథ్

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సమస్యలపై సభ్య రైతులతో కలిసి పోరాటం చేద్దామని వైఎస్సార్‌సీపీ చోడవరం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఇటీవల అనారోగ్యానికి గురైన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావును స్వగ్రామమైన గోవాడలో బుధవారం అమర్‌నాథ్ పరామర్శించారు. సత్యారావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మండలంలోని ముఖ్య నాయకులతో అమర్‌నాథ్ సమీక్షించారు. ఇటీవల అమెరికా పర్యటన తర్వాత మొదటి సారిగా నియోజకవర్గానికి రావడంతో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చి ఆయనతో మాట్లాడారు. గ్రామాల్లో, పార్టీలో నెలకొన్న తాజా పరిస్థితులపై గ్రామస్థాయి నాయకులు వివరించారు. అలాగే గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిస్థితి రోజురోజుకీ దయనీయంగా తయారవుతోందని, రైతులకు చెరకు బకాయిలు కూడా ఇచ్చే పరిస్థితిలో ఫ్యాక్టరీ లేదని పలువురు నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు అమర్‌నాథ్ స్పందిస్తూ ఈ విషయమై ఫ్యాక్టరీ, చెరకు రైతుల పరిస్థితిని ప్రభుత్వానికి తెలిసేలా పోరాటం చేయాలన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోనూ వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలతో మండల స్థాయి, గ్రామ స్థాయి సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ముందుగా మండలాల వారీగా నాలుగు సమావేశాలు నిర్వహిస్తామన్నారు. చోడవరం మండల సమావేశం ఈ నెలలో నిర్వహించేందుకు నిర్ణయించామని, త్వరలో సమావేశం తేదీని తెలియజేస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను ప్రజలకు తెలియజేసేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, ఎంపీపీ గాడి కాసు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పల్లా నర్సింగరావు, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, శరగడం నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీల ఫ్లోర్ లీడర్ పల్లా రమణ, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, ప్రధాన కార్యదర్శి పందిరి శ్రీనివాసరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, జిల్లా కార్యదర్శి పోతల శ్రీనివాసరావు, డీఆర్‌యూసీ సభ్యుడు బొడ్డు శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీ బస్సుకు మంటలు

- ఇంజిన్ ఆయిల్ లీకేజీయే కారణం


సగం కాలిపోయిన బస్సును పరిశీలిస్తున్న రూరల్ ఎస్ఐ రవికుమార్

అనకాపల్లి టౌన్: పరవాడ లారస్ కంపెనీకి చెందిన బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. చోడవరంలో నివాసముంటున్న కంపెనీ ఉద్యోగులను తీసుకురావడానికి లంకెలపాలెం నుంచి బుధవారం ఉదయం 11 గంటల సమయంలో బస్సు బయలుదేరింది. తుమ్మపాల దర్జీనగర్‌కు చేరుకొనే సమయంలో వెనక నుంచి వచ్చిన ద్విచక్రవాహనదారులు బస్సు వెనక మంటలు వస్తున్నాయని చెప్పడంతో డ్రైవర్ బస్సును నిలిపివేశారు. ఈ సమయంలో బస్సులో మరెవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పినట్లయింది. వెంటనే స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం తెలపడంతో హుటాహుటిన సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదం ఇంజిన్‌లో ఆయిల్ లీకేజీ వలన జరిగిందని రూరల్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. బస్సు ముందు భాగం, లోపల సీట్లు పూర్తిగా కాలిపోయాయి.

గుట్టుచప్పుడు కాకుండా గ్రావెల్ తరలింపు

- కూటమి నేతల ప్రోద్బలంతో దందా
- చోద్యం చూస్తున్న అధికారులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి శివారు చిన్నోడుపాలెం సమీపంలో బుధవారం రాత్రి గుట్టుచప్పుడు కాకుండా గ్రావెల్ తరలింపు చేపట్టారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమార్కులు గ్రావెల్‌ను తవ్వి తరలించుకుపోతున్నారు. నిరోధించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమికి చెందిన నేతలు గత కొద్ది రోజులుగా పాటిపల్లి పంచాయతీ పరిధిలో గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. కొన్ని సందర్భాల్లో స్థానికులు అడ్డుకుంటున్నా అక్రమార్కులు పట్టించుకోవడం లేదు. పదుల సంఖ్యలో వాహనాలను సమకూర్చి బుధవారం రాత్రి సమయంలో గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. అటు పరవాడ మార్గం ఇటు రాజుపేట మీదుగా నాగవరం వైపునకు గ్రావెల్ తరలిపోతున్నా మైన్స్ అధికారులు, రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. లక్షలాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొండలను పిండేస్తున్నా తమకెందుకులే అన్న చందంగా అధికారుల తీరు ఉందంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ తవ్వకాలను నిరోధించాలని పలువురు కోరుతున్నారు.

అంతర్ రాష్ట్ర మహిళల బ్లైండ్ క్రికెట్ విజేత ఒడిశా

రన్నరప్‌గా ఆంధ్రప్రదేశ్ జట్టు


రన్నరప్ జట్టు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు


విజేత జట్టు ఒడిశాకు ట్రోఫీ అందజేస్తున్న ఎన్టీపీసీ జీఎం సమీర్‌శర్మ, హెచ్‌ఆర్

ఉక్కునగరం: ఉక్కు స్టేడియంలో జరిగిన అంతర్ రాష్ట్ర మహిళల బ్లైండ్ క్రికెట్ చాంపియన్‌షిప్‌ను ఒడిశా జట్టు కైవసం చేసుకుంది. ఎన్టీపీసీ సింహాద్రి సహకారంతో క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఆంధ్రప్రదేశ్ (సీఏబీఏపీ), క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ కేరళ (సీఏబీకే) సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన టోర్నమెంట్‌లో ఢిల్లీ, ఒడిశా, కేరళ, ఆంధ్రప్రదేశ్ జట్లు పాల్గొన్నాయి. బుధవారం జరిగిన ఫైనల్స్‌లో ఒడిశా జట్టు మొదట బ్యాటింగ్‌కు దిగింది. 15 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 109 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆంధ్రప్రదేశ్ జట్టు 15 ఓవర్లలో 80 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో ఒడిశా జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌కు డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి హాజరై క్రీడాకారులను అభినందించారు. ముగింపు కార్యక్రమంలో ఎన్టీపీసీ ఈడీ సమీశ్ శర్మ, హెచ్‌ఆర్ బి.బి.శర్మ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. ఇండియన్ బ్లైండ్ క్రికెట్ మాజీ కెప్టెన్ అజయ్‌కుమార్ రెడ్డి, కో–ఆర్డినేటర్లు అమ్మి నాయుడు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

దాత సాయం.. గోతుల రోడ్డుకు మోక్షం


తైపురం వద్ద గోతులు పూడ్చివేత


రాజాం వద్ద గోతులను లెవిలింగ్ చేస్తున్న పొక్లెయిన్


ట్రాక్టర్లపై తరలిస్తున్న గ్రావెల్

బుచ్చెయ్యపేట : మండలంలో గల రాజాం, తట్టబంద (ఆర్టీ) రోడ్డులో గోతులకు మోక్షం కలిగింది. రాజాం నుండి తురకలపూడి వరకు పెద్దపెద్ద గోతులు పడి రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గోతులను పూడ్చాలని పలువురు కోరినా అధికారులు, పాలకులు పట్టించుకోలేదు. ఈ రహదారిలో రాకపోకలు సాగించే రావికమతం, బుచ్చెయ్యపేట మండలాలకు చెందిన 25 గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డు గోతుల వల్ల అనకాపల్లి ఆర్టీసీ అధికార్లు బస్సులు నడపడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోతుల్లో పడి పలువురు వాహనదారులు తీవ్ర గాయాలపాలవుతున్నారు. రావికమతం మండలం జీడిపిక్కల ఫ్యాక్టరీ యజమాని ప్రభు ప్రయాణికులు కష్టాలను చూసి ముందుకొచ్చారు. సుమారు రూ.2 లక్షలతో ఐదు కిలోమీటర్ల పొడవున ఉన్న గోతులను కప్పించారు. గోతులను పొక్లెయిన్‌తో లెవిలింగ్ చేసి గ్రావెల్‌తో గోతులను పూడ్చారు. సజావుగా వాహనాలు రాకపోకలు సాగేలా చేశారు.

అప్పన్నకు మూడో విడత చందనం సమర్పణ

సింహాచలం: జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మూడో విడత చందనం సమర్పణ బుధవారం శాస్త్రోక్తంగా జరిగింది. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామికి సుప్రభాత సేవ అనంతరం మూడు మణుగుల(సుమారు 125 కిలోలు) పచ్చి చందనాన్ని స్వామికి సమర్పించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. తదుపరి స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థానమండపంలో వేంజేపచేసి జ్యేష్టాభిషేకాన్ని ఘనంగా జరిపారు. గంగధార జలాలు, పంచామృతాలతో పంచకలశ స్నపనాన్ని నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.


రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- రబీ వరికి గిట్టుబాటు ధర లేక ఆర్థిక ఇబ్బందులు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్


రబీ వరిని కొనుగోలు చేయకపోవడంతో రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: రబీ సీజన్‌లో సాగైన వరిని కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. రబీలో వరి పంట సాగు చేసి గింజలను సేకరించే క్రమంలో ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మండలంలోని వాడ్రాపల్లిలో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయలేదన్న సమాచారం మేరకు ఆయన బుధవారం ధాన్యం బస్తాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న వరి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించి సకాలంలో మెరుగైన ధరలు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. కల్లాల్లో ధాన్యం పాడైపోయి రైతులు అల్లాడిపోతున్నా పాలకులు, అధికారులకు పట్టకపోవడం విచారకరమన్నారు. రంగు మారిన ధాన్యానికి కూడా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సరైన ధర అందించారన్నారు. అన్ని విధాలా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కాండ్రేగుల నూకరాజు, భీశెట్టి గంగప్పలనాయుడు, తిమ్మరాజుపేట ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, రైతులు బొడ్డేడ సత్యనారాయణ, మళ్ల జోగినాయుడు, కాండ్రేగుల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ


యోగాసన పోటీలలో విజేతలుగా నిలిచిన నరసింగరావు, నాగమణి

అనకాపల్లి టౌన్: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో శారదా యోగా శిక్షాలయ సారథ్యంలో ఆల్ ఇండియా యోగా కల్చర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల 35వ నేషనల్ ట్రెడిషనల్ యోగాసన చాంపియన్ షిప్–2025 పోటీలు జరిగాయి. జాతీయ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో 12 రాష్ట్రాల నుంచి 680 మంది తలపడ్డారు. తుమ్మపాల గ్రామం శ్రీకృష్ణ యోగా సెంటర్ గురువు బుదిరెడ్డి నరసింగరావు 55–65 సంవత్సరాల కేటగిరీలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. 66–75 సంవత్సరాల కేటగిరీలో బుదిరెడ్డి నాగమణి ఐదో స్థానంలో నిలిచి సత్తా చాటారు.

హైదరాబాద్-కటక్ మధ్య ప్రత్యేక రైలు పొడిగింపు

తాటిచెట్లపాలెం(విశాఖ): హైదరాబాద్- కటక్-హైదరాబాద్(వయా దువ్వాడ మీదుగా) మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలును మరికొంతకాలం పొడిగించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. హైదరాబాద్-కటక్ (07165) స్పెషల్ హైదరాబాద్‌లో ఈ నెల 17, 24వ తేదీల్లో రాత్రి 8.10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.07 గంటలకు బయలుదేరి అదేరోజు సాయంత్రం 5.45 గంటలకు కటక్ వెళ్తుంది. కటక్-హైదరాబాద్(07166) స్పెషల్ కటక్‌లో ఈ నెల 18, 25వ తేదీల్లో రాత్రి 10.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.37 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ వెళ్తుంది.

విశాఖలో తాత్కాలిక రెడ్ జోన్

- ప్రధాని పర్యటనకు భారీ భద్రత
- 17 నుంచి 21 వరకు కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్ హోటల్ వరకు నో డ్రోన్ జోన్

విశాఖ సిటీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటన సందర్భంగా పోలీస్ శాఖ పటిష్ఠ భద్రతా చర్యలు చేపడుతోంది. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈ నెల 21వ తేదీన విశాఖలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు పీఎం విశాఖ రానున్నారు. ఈ సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 17వ తేదీ ఉదయం 10 నుంచి 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు నేవల్ కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్ హోటల్ మధ్య తాత్కాలిక రెడ్ జోన్‌ను విధించారు. అలాగే ఆ ప్రాంతాన్ని నో డ్రోన్ జోన్‌గా ప్రకటించారు. ఆయా తేదీల్లో ఆ ప్రాంతానికి 5 కిలోమీటర్ల పరిధిలో డ్రోన్లను ఎగరవేయడాన్ని నిషేధించారు. ఎవరైనా అతిక్రమిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు.

కె.జె.పురం జంక్షన్‌లో ఆక్రమణల తొలగింపు


కె.జె.పురం జంక్షన్‌లో ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్


జంక్షన్‌లో నిర్మించిన అన్నదాన సత్రం ముందు భాగం తొలగిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం జంక్షన్‌లో ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం చేశారు. రహదారి కిరువైపులా గల ఆక్రమణలు తొలగించి, డ్రైనేజిలను నిర్మించాలని కోరుతూ విశ్రాంత ఉపాధ్యాయుడు, స్థానిక కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రాపేట రామకొండలరావు, స్థానికులు తాకాశి శ్రీను తదితరులు ఈ ఏడాది మార్చి 10 న అనకాపల్లి జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మార్చి 19న ఆర్‌అండ్‌బీ, స్థానిక పంచాయతీ అధికారులు సర్వే చేసి ఆక్రమణల తొలగింపునకు మార్కింగ్ చేశారు. తర్వాత పొక్లెయిన్తో ఆక్రమణల తొలగించే ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ బుధవారం మాడుగుల ఆర్‌అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్, వారి సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శి నవీన్‌దొర, సిబ్బంది, ఎస్ఐ నారాయణరావు, హెడ్ కానిస్టేబుల్ పెద్దయ్య, తదితర పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో రోడ్డు మధ్య భాగం నుంచి 11 మీటర్లు అటు, ఇటు వైపునా ఆక్రమణలు తొలగించారు. జంక్షన్‌లో నిర్మించిన 33 మీటర్ల వరకు ఉన్న ఈ ఆక్రమణలను తొలగించారు. దీనిలో భాగంగా సంతోషిమాత ఆలయం అన్నదాన సత్రం ముందు భాగంలో గల అరుగును, బాత్రూమ్, వంటశాల, సంతోషిమాత ముందు భాగంలో తొలగించారు. ఈ ఆక్రమణలు తొలగింపు విషయంలో ఎటువంటి సంఘటనలు జరగకుండా ఎస్ఐ జి. నారాయణరావు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. వీఆర్వో నాగప్పారావు, సర్వేయరు రాజేష్ పాల్గొన్నారు.

అన్నదాన సత్రం కూల్చివేతకు కుట్ర : ఆలయ కమిటీ చైర్మన్ ధ్వజం

అన్నదాన సత్రం కూల్చివేయడానికి కొంత మంది వ్యక్తులు కుట్ర చేసి సత్రం ముందు భాగం కూల్చివేశారని, ఇది అన్యాయమని సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు ఆరోపించారు. ఎంతో మందికి మధ్యాహ్నం సమయంలో అన్నదానం చేస్తున్న సత్రంను ఎంతో మంది దాతల సహకారంతో నిర్మించామని తెలిపారు. ఆలయం ముందు భాగంలో విగ్రహాలను కూడా తొలగించారని, దీనిని ప్రజలు గమనిస్తున్నారని అమ్మతల్లినాయుడు పేర్కొన్నారు.

ఏయూలో కొలువుదీరిన కొత్త నాయకత్వం


నియామక ఉత్తర్వులు అందుకున్న డీన్‌లు, డైరెక్టర్లు, అసోసియేట్ డైరెక్టర్లతో వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం విభాగాలకు నూతన నాయకత్వం పదవీ బాధ్యతలు చేపట్టింది. ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు చేతుల మీదుగా డీన్, డైరెక్టర్, అసోసియేట్ డైరెక్టర్లకు బుధవారం నియామక ఉత్తర్వులను అందించారు. మొత్తం 43 మందికి వివిధ పదవీ బాధ్యతలను కేటాయించారు. అనంతరం వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో శతాబ్ది ఉత్సవాలను ప్రారంభించామని, త్వరలో నూతన కార్యక్రమాలను చేపట్టేలా ప్రతి విభాగం పనిచేయాలన్నారు. విద్యార్థులతో, సిబ్బందితో గౌరవప్రదంగా నడుచుకోవాలన్నారు.

యువతకు ప్రాధాన్యత : నూతనంగా నియామకం చేసిన డీన్, డైరెక్టర్, అసోసియేట్ డైరెక్టర్లలో అత్యధికంగా యువతకు అవకాశం కల్పించారు. ప్రతి విభాగంలో ఉన్న యువ ఆచార్యులను ఎంపిక చేసి ఈ బాధ్యతలు కేటాయించారు. భవిష్యత్ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ వర్సిటీని ముందుకు నడిపించే దిశగా యువ ఆచార్యులను ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు.

సమస్యల ఒడి.. సర్కార్ బడి


నరసింగబిల్లి హైస్కూలులో నిధుల లేమితో రంగులు వేయకుండా ఉన్న పాఠశాల భవనం

- నేటి నుంచి బడుల పున ః ప్రారంభం
- అసంపూర్తిగా రెండో విడత నాడు–నేడు అభివృద్ధి పనులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

> వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభంకానున్నాయి. నూతన విద్యాసంవత్సరంలో సర్కారు బడులు సమస్యలతో విద్యార్థులను స్వాగతించనున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానంలో ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లు నిర్వహించనున్నారు. ఈ విధానం విద్యార్థులను గందరగోళానికి గురి చేసేలా ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకు యూనిఫాం, బ్యాగ్, బూట్లు సరఫరా చేయలేదు. నాడు-నేడు పనులు పూర్తి చేయకపోవడంతో విద్యార్థులు చాలీచాలని గదుల్లో నే విద్యనభ్యసించాలి

కశింకోట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేసి ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడులో మంజూరు చేసిన పాఠశాలల భవనాలను పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. దీంతో విద్యార్థులు చాలీచాలని గదుల్లో ఇబ్బందులను ఎదుర్కోక తప్పని పరిస్థితి నెలకొంది. ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానంలో ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లు నడవనున్నాయి. ఇది విద్యార్థులను గందరగోళానికి గురి చేసేలా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు స్కూలు యూనిఫాం, బ్యాగ్, బూట్లు సరఫరా చేయలేదు. ఎప్పుడు సరఫరా అవుతాయో తెలియని పరిస్థితి ఉంది. మండలంలో 57 ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థలున్నాయి. వీటిలో పది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, తేగాడలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం, మోడల్ స్కూలు, తాళ్లపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలున్నాయి. ఇవి కాకుండా ఈ ఏడాది కొత్త విద్యా విధానంలో నాలుగు మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేశారు. వీటిలో కశింకోట బాలికల ప్రాథమిక పాఠశాల, 6వ ప్రాథమిక పాఠశాల, నరసింగబిల్లి, జమాదులపాలెం పాఠశాలలున్నాయి. 33 బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, 7 ఫండమెంటల్ స్కూళ్లున్నాయి. వీటిలో గత ఏడాది 3,788 మంది విద్యార్థులు చదివారు. పాఠశాలలు ప్రారంభం కావస్తున్నా వీరికి ఇంకా యూనిఫాం, బ్యాగు, షూలు సరఫరా కాలేదు. కేవలం పాఠ్య పుస్తకాలు, నోట్, వర్క్ పుస్తకాలు, బెల్టు మాత్రం పాఠశాలలకు సరఫరా చేశారు. మరి యూనిఫాం, బ్యాగ్ ఎప్పుడు సరఫరా చేస్తారో తెలియని పరిస్థితి.


కశింకోట బాలికల హైస్కూలులో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

అసంపూర్తిగా పనులు

పలు పాఠశాలల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రెండో విడతగా మంజూరు చేసిన నాడు–నేడు భవనాలు పూర్తి కాలేదు. స్థానిక బాలికల హైస్కూలులో రూ.36 లక్షలతో మంజూరైన ఆరు తరగతి గదులు అసంపూర్తిగా ఉన్నాయి. రూ. 20 లక్షలతో పనులు నిర్వహించి నిలిపి వేశారు. మిగతా నిధులు రాకపోవడంతో పనులు ఎక్కడ వేసిన గొంగలి అన్నట్లు ఉన్నాయి. రంగులు వేయడంతో పాటు గచ్చులు, విద్యుత్, ఫర్నిచర్ ఏర్పాటు చేయవలసి ఉంది.

➡ కొత్తపల్లి హైస్కూలులో నాడు–నేడులో మంజూరైన మూడు గదులు.. నిధులు లేక భవనం పునాది స్థాయిలో నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా పనుల్లో ఇసుమంత కదలిక లేదు.

➡ నరసింగబిల్లి హైస్కూలులో ఆరు గదుల భవనం నిర్మాణం దాదాపు పూర్తయింది. రంగులు వేయాల్సి ఉంది. ఇందుకు రూ.3 లక్షలు ఖర్చు కాగలదని అంచనా. ఇది పూర్తి అయితే పాఠశాల విద్యార్థులకు గదుల కొరత తీరనుంది.

➡ **బయ్యవరం హైస్కూలులో నాడు–నేడులో చేపట్టిన టాయిలెట్ల నిర్మాణ పనులు పూర్తి కాలేదు. ప్రాథమిక పాఠశాలల్లో తాళ్లపాలెం–1 స్కూలులో మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. మోసయ్యపేట స్కూల్‌కు రంగులు వేయాల్సి ఉంది. వినన్నపేట** స్కూలులో గచ్చులకు టైల్స్ వేయలేదు. వంటగది అసంపూర్తిగా ఉంది. వీటికి నిధులు లేక అసంపూర్తిగా నిలిచి ఉన్నాయి.


కశింకోటలో 2వ బాలికల ప్రాథమిక పాఠశాల

గందరగోళంగా పాఠశాలల ఏర్పాటు

ఈ ఏడాది కొత్త విద్యా విధానంలో పలు కేటగిరీలుగా విభజించి ఏర్పాటు చేసిన పాఠశాలలు విద్యార్థులను గందరగోళానికి గురి చేసేలా ఉన్నాయనే విమర్శలున్నాయి. మండలంలో ఉన్న పది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 6 నుంచి పది తరగతుల వరకు, 1 నుంచి పది వరకు మిగిలిన ఐదు పాఠశాలలు ఏర్పాటు చేశారు. 1 నుంచి పది తరగతుల వరకు ఏర్పాటు చేసిన నరసింగబిల్లి, తాళ్లపాలెం, కొత్తపల్లి, బయ్యవరం హైస్కూళ్ల పక్కనే ప్రాథమిక పాఠశాలలు కూడా ఉన్నాయి. కన్నూరుపాలెం, పాత కన్నూరుపాలెం ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి మాత్రమే ఉండగా, కన్నూరుపాలెం హైస్కూలులో 1 నుంచి పదవ తరగతి వరకు ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులను ఎక్కడ చేర్చాలో తెలియక తల్లిదండ్రులు గందరగోళానికి గురవుతున్నారు. ఇక ఉగ్గినపాలెం, జి. భీమవరం, అచ్చెర్ల ప్రాథమికోన్నత పాఠశాలలను ఎత్తి వేసి వాటిని ప్రాథమిక పాఠశాలలకు పరిమితం చేశారు. దీంతో ఆయా పాఠశాలల ఉన్నత తరగతుల విద్యార్థులు దూరంలో ఉన్న తాళ్లపాలెం ఉన్నత పాఠశాలకు రావలసిన పరిస్థితి ఏర్పడింది. ఇలా పలు సమస్యలతో పాఠశాలలు పునః ప్రారంభం అవుతుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

నేటి నుంచి పుస్తకాలు అందజేస్తాం

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఇప్పటికే పాఠ్య, నోట్, ఇతర పుస్తకాలను సరఫరా చేశాం. పాఠశాలలు ప్రారంభం అయ్యే గురువారం నుంచి వీటిని విద్యార్థులకు అందజేస్తాం. అయితే యూనిఫాం, స్కూలు బ్యాగ్, షూస్ రావలసి ఉంది. అవి వచ్చిన వెంటనే విద్యార్థులకు అందిస్తాం.నిధులున్న మేరకు నాడు–నేడు పనులు చేశాం.

– సురేష్‌కుమార్, ఎంఈవో, కశింకోట.

క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరా బంద్

అనకాపల్లి: విద్యుత్ వైర్ల మరమ్మతు పనుల నిమిత్తం విద్యుత్ శాఖ డి–1 సెక్షన్ ఉడ్‌పేట, పెరుగుబజార్ ఫీడర్ల పరిధిలో ఈనెల 13వ తేదీన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఆశాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏడీ త్రినాథ్‌లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉడ్‌పేట ఫీడర్ పరిధిలో గూడ్స్‌రోడ్డు, కొణతాల వారివీధి, వాటర్‌ట్యాంక్ ఏరియా, శేఖవీధి, ఆమంచివారి వీధి, వేల్పులవీధి, పెరుగుబజార్ ఫీడర్ పరిధిలో లక్ష్మీనారాయణనగర్, పల్లపువీధి, యర్రవారివీధి, గొల్లవీధి, రింగ్ రోడ్డు ఏరియాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని వారు కోరారు.

సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి


శాంతినగర్ సచివాలయంలో ఆధార్‌సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో మంజులా వాణి

అనకాపల్లి: సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని డీఎల్‌డీవో మంజులా వాణి అన్నారు. స్థానిక గవరపాలెం శాంతినగర్ సచివాలయంలో ఆధార్ సెంటర్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గవరపాలెంలో శాంతినగర్, నీలకంఠారావువీధి సచివాలయాల్లో ఈనెల 13వ తేదీ వరకూ ఆధార్ కేంద్రాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ


వెంకటరమణపేట జంక్షన్‌లో కురుస్తున్న వర్షం

అనకాపల్లి: మండలంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. మండల వ్యాప్తంగా రెండు మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రంగాచారి సూచించారు.

ఘనంగా దుర్గామల్లేశ్వర ఆలయ వార్షికోత్సవం

మాకవరపాలెం: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గల దుర్గామల్లేశ్వర దేవస్థానం పదో వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు పూజల్లో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారిని ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, గ్రామ పెద్దలు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు మల్లికార్జునశర్మ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 96 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,920	4,930
రెండో రకం	3,670	4,100
మూడో రకం	3,400	3,610

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్-1	: గ్యాంబ్లర్స్
సత్యనారాయణ స్క్రీన్-2	: 007
పర్తిసాయి	:ఖలేజా
షిర్డీసాయి	: థ్రగ్ లైఫ్
వెంకటేశ్వర	:రాజావారు
శ్రీ సత్య	:శుభం
రామచంద్ర	: పాడేరు 12వ మైలు

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 66 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్ 22 యూనిట్లు, బి పాజిటివ్ -9 యూనిట్లు, ఒ పాజిటివ్ -28 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -7 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్(ఫోన్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 358 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 321 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి(ఫోన్ నంబర్ 08924-223595)ను సంప్రదించవచ్చు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై డీఆర్వోకు వినతి

తుమ్మపాల: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేసిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఆర్టీసీ ఉద్యోగులు బుధవారం డీఆర్వో వై.సత్యనారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల సమస్యలపై వంద రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా అధికారులు కనీసం స్పందించడం లేదని, పీజీఆర్ఎస్‌లో అందజేసిన అర్జీలకు పొంతన లేని సమాధానాలతో అనకాపల్లి డిపో అధికారులు ఎండార్స్‌మెంట్ ఇచ్చారని పేర్కొన్నారు. ఉద్యోగుల సంఘం తీర్మానం మేరకు ఈ నెల 25 తర్వాత జిల్లావ్యాప్తంగా సమ్మె చేయనున్నట్టు తెలిపారు. కలెక్టర్ స్పందించి చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ అధికారులకు ఆదేశించాలని కోరారు. అంతకుముందు కలెక్టరేట్ గేటు వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు.


డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

విద్యార్థులకు పాటల పోటీలు

అనకాపల్లి టౌన్: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి సందర్భంగా పట్టణంలోని గాంధీనగరం ప్రభుత్వ ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రథమ బహుమతి కె.సాయికిరణ్, ద్వితీయ బహుమతి ఎల్.గణేష్, తృతీయ బహుమతి బి.మోహన్, నాల్గవ బహుమతి డి.శ్రీహరి, ఐదవ బహుమతి ఎస్.రవికుమార్ పొందారు. విజేతలకు సిద్ధార్థ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేషగుప్తా, ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సిద్ధార్థ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం

25న ఏపీ ప్రజానాట్య మండలి జిల్లా మహాసభ

అనకాపల్లి: ప్రజానాట్యమండలి జిల్లా ప్రథమ మహాసభను ఈనెల 25న స్థానిక కొడుగంటి గోవిందరావు భవనంలో నిర్వహించనున్నట్టు ప్రజానాట్య మండలి జిల్లా ప్రతినిధి గొర్లి దేముడుబాబు తెలిపారు. ఈ సభకు సంబంధించిన కర పత్రాలను స్థానిక మెయిన్‌రోడ్డులో గల వై.విజయకుమార్ హాల్లో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళ ప్రజల కోసమేనన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతరం ప్రజలను జాగృతి చేసేందుకు ప్రజానాట్య మండలి కృషి చేస్తోందని చెప్పారు. ఎంతోమంది కళాకారులను, రచయితలను సృష్టించిందన్నారు. కార్పొరేట్ సంస్కృతికి ప్రత్యామ్నాయంగా ప్రజా కళలను తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాట్యమండలి మండల సభ్యులు కొండూరి వీరాచారి,రాజాన దొరబాబు, వియ్యపు రాజు, కోరుమిల్లి శంకరరావు, విత్తనాల పోతురాజు, ముత్యూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


ప్రజానాట్య మండలి జిల్లా మహాసభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గొర్లి దేముడుబాబు

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

కశింకోట: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. పల్లపు సోమవరంలో 'పల్లె పిలుస్తోంది రా..కదలి రా..'కార్యక్రమంలో భాగంగా నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ మోసాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, పోక్సో చట్టం తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, సీఐ అల్లు స్వామి నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్ల కార్డులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, డీఎస్పీ శ్రావణి

నిర్వాసితులకు అదనంగా పరిహారం చెల్లించాలి

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం గ్రామం వద్ద బాబూ జగజ్జీవన్‌రావ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు కాలువ తవ్వకంలో కోల్పోయే భూములకు ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం నష్ట పరిహారం చెల్లించడంతోపాటు అదనంగా పరిహారం చెల్లించాలని, ఇందుకు కలెక్టర్ చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరారు. ఈ మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి సమక్షంలో ఉగ్గినపాలెంకు చెందిన సుజల స్రవంతి ప్రాజెక్టులో కోల్పోనున్న భూముల రైతులతో బుధవారం అనకాపల్లిలో సమావేశం నిర్వహించినట్టు ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడు తెలిపారు. ఉగ్గినపాలెంలో సుజల స్రవంతి ప్రాజెక్టు కోసం 2021లో భూసేకరణలో 40.65 ఎకరాల భూమి కోల్పోనున్నట్టు ప్రాథమిక నోటిఫికేషన్‌లో పేర్కొన్నారని, నిధులు మంజూరు కానందున పరిహారం చెల్లించక నోటిఫికేషన్ రద్దు అయిందన్నారు. ఈ నేపథ్యంలో నిషేధం వల్ల భూములు కొనుగోలు, అమ్మకాలు నిలిచిపోయి రైతులు ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉందన్నారు. దీనిదృష్ట్యా కొత్తగా ప్రభుత్వం జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌లో ప్రస్తుత భూముల మార్కెట్ విలువ మేరకు రైతులకు పరిహారం, అదనపు పరిహారం చెల్లించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత రైతులు సమావేశంలో పాల్గొన్నారు.

నేడు వృత్తి నిపుణుల సమావేశం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని విజయ రెసిడెన్సీలో గురువారం సాయంత్రం 5 గంటలకు వృత్తి నిపుణుల సమావేశం జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరావు తెలిపారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా డాక్టర్లు, లాయర్లు, వ్యాపార ప్రముఖులు, చార్టెడ్ అకౌంటెంట్స్, ఇంజనీర్లు, పారిశ్రామిక వేత్తలతో ఈ సమావేశం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఇమ్యునైజేషన్


ఇమ్యునైజేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కశింకోట: స్థానిక గవరపేటలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలకు మందులను ఉచితంగా అందజేశారు. హెల్త్ కార్డుల కోసం పేర్లు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దుర్గ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పల్లపు సోమవరంలో ఏరువాక పౌర్ణమి

కశింకోట: మండలంలోని పల్లపు సోమవరంలో బుధవారం ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికారులు, ప్రజలతో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పంట భూముల్లోకి వెళ్లి అరకతో దున్ని, వరి విత్తనాలు జల్లారు. రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించిన వరి విత్తనాల బస్తాలు అందజేసి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందజేసిన ఇండస్ స్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గృహ నిర్మాణ శాఖకు సంబంధించి సమీక్షించారు. మహిళలకు ముగ్గుల పోటీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి బి. మోహనరావు, ఐసీడీఎస్ పీడీ సూర్యకుమారి, సీడీపీవో ప్రభావతి, ఎంపీడీవో వి.వి. రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న, హౌసింగ్ ఏఈ వి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంతిమ సంస్కారాలు

అనకాపల్లి: అనాథ మృతదేహానికి దేవా సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. యలమంచిలి జాతీయ రహదారిపై రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తి (35) మృతదేహాన్ని అక్కడ పోలీసులు కనుగొని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో భద్రపరిచారు. బంధువులెవరూ రాకపోవడంతో పోలీసుల సహకారంతో బుధవారం మృతదేహాన్ని అనకాపల్లి హిందూ శ్మశానవాటికలో ఖననం చేసినట్టు దేవా సోషల్ సర్వీస్ ప్రతినిధి తరుణ్ తెలిపారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం


అనకాపల్లి హిందూ శ్మశాన వాటికలో ఖననం చేస్తున్న దేవా సోషల్ సర్వీస్ ప్రతినిధి తరుణ్

బస్సు దగ్ధంపై సమగ్ర విచారణ జరపాలి

అనకాపల్లి: పరవాడ ఫార్మాసిటీ నుంచి చోడవరం వెళుతున్న బస్సు అగ్నిప్రమాదానికి గురైన సంఘటనపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.లోకనాథం బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒక పక్క ఫార్మాకంపెనీల్లో ప్రమాదాలు జరిగి అనేక మంది కార్మికులు మరణిస్తుండగా, మరో పక్క ఫార్మాకంపెనీలకు కార్మికులు, ఉద్యోగులను తరలించే బస్సులు రహదారి, అగ్ని ప్రమాదాలకు గురవుతున్నాయని తెలిపారు. కాలం చెల్లిన బస్సుల్లో కార్మికులను తరలించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాదాలపై సమగ్ర విచారణ జరపడంతో పాటు ఫార్మా, ఇతర పరిశ్రమలకు కార్మికులను తీసుకువెళుతున్న బస్సుల ఫిట్‌నెస్, ఇతర సౌకర్యాలపై ఆర్టీవో అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించి, కార్మికుల భద్రత కల్పించాలన్నారు.

కాలంచెల్లిన బస్సులతో ప్రమాదాలు : కాలం చెల్లిన ఫార్మా,బ్రాండిక్స్ బస్సులు తరచూ ప్రమాదాలకు గురవుతుండడంతో కార్మికుల ప్రాణాలకు భద్రత లేకుండా పోతోందని, జిల్లా రవాణాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని జిల్లా రైతు కూలీసంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్ రావు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. పరవాడ ఫార్మాకంపెనీ నుంచి చోడవరం వెళుతున్న బస్సులో అనకాపల్లి మండలం బవులవాడ వద్ద ఆకస్మికంగా మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయిందని, బస్సులో కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం యలమంచిలి వద్ద బ్రాండిక్స్ కంపెనీ బస్సు ప్రమాదానికి గురై, పలువురు కార్మికులు గాయపడ్డారని తెలిపారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ యాజమాన్యాలపైన, బస్సుల కాంట్రాక్టర్లపై పరిశ్రమల అధికారులు, రవాణా శాఖ తగిన చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని తెలిపారు. ప్రతి ఏడాది బస్సులను ఆర్టీవో అధికారులు తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు.

పంపిణీకి 756 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం

కశింకోట: మండలంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా రాయితీపై పంపిణీ చేయడానికి 756 క్వింటాళ్ల వరి విత్తనాలను సిద్ధం చేసినట్టు మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న తెలిపారు. ఆర్జీఎల్ 2537, సాంబ మసూరి, సోనా మసూరి, మార్టేర్ సాంబ, ఆర్ఎన్ఆర్ 15048, ఎంటీయూ 1224 రకాల విత్తనాలు సిద్ధం చేసినట్టు తెలిపారు. రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకంతో రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. త్వరలోనే పంపిణీ చేపడతామని చెప్పారు.


కశింకోట రైతు సేవా కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

డిప్యూటీ ఎంపీడీవో, ఏవోలకు బదిలీ

మాకవరపాలెం : డిప్యూటీ ఎంపీడీవో సీతామహాలక్ష్మి, వ్యవసాయ అధికారి చిరంజీవి బదిలీ అయ్యారు. ఐదేళ్లుగా వీరిద్దరూ మండలంలో పనిచేస్తున్నారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీల్లో సీతామహాలక్ష్మిని అల్లూరి జిల్లా చింతపల్లి, చిరంజీవికి రోలుగుంట మండలాలకు మదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. అలాగే వజ్రగడ, మల్లవరం, బయ్యవరం, పెద్దిపాలెం పంచాయతీ కార్యదర్శులకు కూడా బదిలీ అయిందని ఎంపీడీవో చాయాసుధ బుధవారం తెలిపారు.

35 మందికి కంటి వైద్య పరీక్షలు

రావికమతం : కొత్తకోట గ్రామంలో వేంకటేశ్వర పుష్పగిరి ఆస్పత్రి సౌజన్యంతో పతివాడ చిన్నంనాయుడు కుమారుడు ధనుంజయ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి 35 మంది రోగులు హాజరయ్యారు. వీరికి డాక్టర్లు పావని, కావ్య కంటి పరీక్షలు చేశారు. వీరిలో 20 మందికి ఆపరేషన్లు అవసరంగా గుర్తించారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు అందచేశారు. ఆపరేషన్‌కు అవసరమైన 20 మందికి శ్రీ వేంకటేశ్వర పుష్పగిరి ఆస్పత్రికి తరలించారు.